ఈనాడు
జోగులాంబ గద్వాల
శనివారం సెప్టెంబరు 28, 2024

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు ఆదర్శనీయం


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గం, చేసిన సేవలు భావితరాలకు ఆదర్శనీయమని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ జయంతి నిర్వహించారు. కలెక్టర్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి సాయుధ పోరాటం నుంచి రాజకీయ పోరాటం వరకు తన త్యాగస్ఫూర్తిని ప్రదర్శించారని వివరించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఏవో వీరభద్రప్ప, జడ్పీ సీఈవో కాంతమ్మ, ఇన్‌ఛార్జి బీసీ సంక్షేమ శాఖాధికారి రమేశ్‌బాబు, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి సరోజమ్మ ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు..



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసులు..

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటం..నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం... ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఆచార్య కొండాలక్ష్మణ్ అలుపెరగని కృషీవలుడని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ఎస్పీ నివాళులర్పించి మాట్లాడారు. తొలి, మలి తెలంగాణ ఉద్యమంలో బాపూజీ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని చెప్పారు. జిల్లా సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులకు మోక్షం

గద్వాల, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో తాజా మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి సుమారు ఎనిమిది నెలలు కావస్తోంది. సర్పంచులుగా కొనసాగిన సమయంలో వాళ్లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. ఎనిమిది నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర సర్పంచుల సంఘం తరఫున ఈ అంశంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆయా సర్పంచులు తమ పదవీకాలంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల కోడ్ గతేడాది అమల్లోకి వచ్చిన సమయంలో గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధుల రాకకు అడ్డుకట్ట పడింది. ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, పల్లె ప్రగతి, ఎస్‌డీఎఫ్ తదితర పద్దుల కింద చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. వచ్చే మూడు నెలల్లోగా మొత్తం పంచాయతీలకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో పంచాయతీరాజ్ యంత్రాంగంలో కదలిక వచ్చింది.


ధరూరు: పంచాయతీ పరిధిలో ప్రహరీ నిర్మాణం (పాతచిత్రం)

మాజీ సర్పంచులకు ఊరట

- ఆయా జిల్లాల వారీగా పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులు, చెల్లించాల్సిన బిల్లుల వివరాలను వెంటనే నివేదించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇటీవల ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఆయా పంచాయతీల్లో తాజా మాజీ సర్పంచులు చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లుల పూర్తి వివరాల నివేదికను పంచాయతీ కార్యదర్శులు, డీపీవోలకు అందించడానికి కసరత్తు చేస్తున్నారు. నివేదికలు కమిషనర్‌కు చేరగానే బిల్లుల చెల్లింపుల ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉంది.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,684 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 10వేల జనాభా పైబడిన పంచాయతీల్లో రూ.30 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉండగా 5 వేల జనాభా పైన పంచాయతీల్లో రూ.20 లక్షల వరకు ఉన్నాయి. 3 వేల జనాభా ఉన్న పంచాయతీల్లో రూ.8-10 లక్షలు, 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల పరిధిలో రూ.5 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు సుమారు రూ.170 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉపాధి పథకంలో నిర్మించిన సీసీ రోడ్లు, ఇతర పనులకు సంబంధించి కూడా పెద్ద ఎత్తున బిల్లులు రావాల్సి ఉందని తాజా మాజీ సర్పంచులు చెబుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వివరాల నివేదికను పంపించనున్నామని జోగులాంబ గద్వాల డీపీవో శ్యామసుందర్ తెలిపారు.

పాఠశాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యం, పాఠశాల శుభ్రతపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు ఆదేశించారు. శుక్రవారం గద్వాల మండలం వీరాపురం గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల అభ్యసన విధానాలను పరిశీలించారు. విద్యార్థులతో సన్నిహితంగా మాట్లాడి వారి బోధన విధానాలు, అవగాహన స్థాయి, ప్రగతి గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను విశ్లేషిస్తూ విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మార్గదర్శక సూచనలు చేశారు. చదువుతో పాటు విద్యార్థుల్లో శారీరక, మానసిక అభివృద్ధి సైతం అత్యంత ముఖ్యమని ఆయన వివరించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై కూడా దృష్టి సారించాలన్నారు. భోజన సమయంలో అందించే నాణ్యమైన ఆహారం వారి ఆరోగ్యానికి ఎంతో కీలకమన్నారు. ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరేఖ, యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

పాలమూరులోనే అత్యధిక వర్షపాతం


ఈనాడు, మహబూబ్‌నగర్: ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన మొదటి ఐదు జిల్లాలు పాలమూరుకు చెందినవే. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మాత్రమే అధిక వర్షాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం సగటున 452.56 మి.మీటర్లు ఉండగా ఇప్పటి వరకు 852.34 మి.మీటర్లు నమోదయ్యింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో సాధారణం, ఓ మోస్తరు వర్షపాతాలే నమోదయ్యాయి. అధిక వర్షపాతంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. ఒక్క నెలలోనే మహబూబ్‌నగర్‌లో 1.52 మీటర్లు, నాగర్‌కర్నూల్-0.97, నారాయణపేట-1.55, వనపర్తి-2.50, జోగులాంబ గద్వాల-2.48 మీటర్ల మేర భూగర్భ జలాలు పైకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైనా సాగు విస్తీర్ణం పెరగలేదు. రాష్ట్రంలోనే సాధారణ విస్తీర్ణంలో తక్కువ సాగైన జిల్లాలో మొదటి స్థానంలో నాగర్‌కర్నూల్ ఉంది. ఈ జిల్లాలో 77.65 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. గద్వాల జిల్లాలో 87.64 శాతం పంటలే సాగయ్యాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లోనూ పూర్తిస్థాయిలో సాగు చేపట్టలేదు. వ్యవసాయ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలను వెల్లడించారు.

భూగర్భ జలాలు మెరుగు పడ్డా పెరగని సాగు


దేవరకద్రలో సాగవుతున్న వరి

పంటలు ఇలా.. (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగైంది
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
జోగులాంబ గద్వాల	3,37,011	2,95,340
వనపర్తి	2,40,233	2,29,588
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
నారాయణపేట	4,27,260	4,22,585



90.17 శాతమే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 18.65 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16.82 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. సాధారణ సాగులో 90.17 శాతం మాత్రమే సాగయ్యింది. ఇందులో వరి 7.64 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. పత్తి-6 లక్షలు, కంది-1.30 లక్షలు, జొన్న-30 వేలు, మొక్కజొన్న-80 వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం కొంత వరకు తగ్గింది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, గద్వాలలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగుపై ప్రభావం చూపుతోంది. ఈ రెండు జిల్లాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ఈసారి పత్తి సాగు తగ్గింది. భారీ వర్షాలతో ఈ పంటకు తెగుళ్లు రావడం, సీజన్ ప్రారంభంలో అనుకున్న స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై ప్రభావం పడింది.



పంట ఆరబోశారు.. జారితే ఏం చేస్తారు?

నేటి చిత్రం

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికి అంది వస్తున్నాయి. కోత కోసిన పంటను ఆరబెట్టుకోడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు పడుతుండటంతో చేతికొచ్చిన పంట ఎక్కడ పాడవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసీ రహదారులపైనే పంటను ఆరబోసుకుంటున్నారు. జడ్చర్ల మండలం కొత్తతండాలో రైతులు జొన్న పంటను జాతీయ రహదారి-167పై ఆరబోసుకున్న వైనాన్ని 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

-ఈనాడు, మహబూబ్‌నగర్

ఆనందమానందమాయె!

- **2008 డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల**
- **ఉమ్మడి జిల్లాలో 361 మందికి అవకాశం**


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో నివసిస్తున్నారు. భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగి. 2008 డీఎస్సీలో 56.5 శాతం మార్కులు పొంది 2,791వ ర్యాంకు సాధించారు. కానీ అప్పుడు ఉద్యోగం రాలేదు. దీంతో రెసిడెన్షియల్ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తుంటే అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులు రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. ప్రస్తుతం ఆమె వయస్సు 53 ఏళ్లు. రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. **- ఉమ**


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నివసిస్తున్నారు. 2008 డీఎస్సీలో 58.5 మార్కులు పొంది 2,294వ ర్యాంకు సాధించారు. 59 మార్కుల వద్ద అప్పుడు కటాఫ్ నిర్ణయించడంతో ఉద్యోగం రాలేదు. అనంతరం పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేశారు. ప్రభుత్వం 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక ఉపాధ్యాయులుగా తీసుకుంటామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **- నరేశ్**


అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఈవో కార్యాలయ అధికారులు

పాలమూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2008 డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు 361 మంది ఉన్నారు. వారందరికి ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమించడానికి రేవంత్ సర్కార్ అనుమతించడంతో సంబంధించిన విద్యార్హతల పరిశీలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువ పత్రాలను విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలిస్తున్నారు. విశేషమేంటంటే 361 మందిలో అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వయస్సు గడువు తీరిపోయింది. వారంతా ఆయా పనులు చేసుకుంటూ ప్రస్తుతం ఉపాధిని పొందుతున్నారు. పలువురు డీఎస్సీతో రాకపోవడంతో ఇతర ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తులు చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలను ఎక్కువగానే ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని పలువురు అభ్యర్థులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తొలిరోజు 82 మంది అభ్యర్థులు హాజరు... : జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. తొలిరోజు కేవలం 82 మంది మాత్రమే పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. డీఈవో కార్యాలయంలో అధికారులు 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి అభ్యర్థులు తరలివచ్చారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత అభ్యర్థుల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులకు జాబితాను సమర్పించనున్నారు. అనంతరం వారిని ఆయా ఖాళీగా ఉన్న స్థానాల్లో తాత్కాలిక పద్ధతిపై నియమించనున్నారు.

సాధించారు. కానిస్టేబుళ్లు, పంచాయతీ కార్యదర్శులు, గురుకులాలు, కేజీబీవీలు, గ్రూప్స్ పోటీ పరీక్షలు రాసి విజయం సాధించారు. ఈ 2008 డీఎస్సీ అర్హత జాబితాలో దాదాపు 100 కంటే

అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలు ఇస్తాం.. : అభ్యర్థులకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే రానున్నాయి. వేతనం, సర్వీస్, ఇతర అంశాలన్నింటిపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. అక్కడ నుంచి అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలను అందజేస్తాం. **- రవీందర్, డీఈవో**

సమస్యలు పరిష్కరించాలని వినతి


జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు

అయిజ, న్యూస్‌టుడే : డిజిటల్ క్రాప్ సర్వేలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరాజు ఆధ్వర్యంలో ఏఈవోలు జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. పక్క రాష్ట్రాల్లో వెయ్యి ఎకరాలకు ఒక ఏఈవో ఉండగా.. ఇక్కడ మాత్రం 6 వేల నుంచి 10వేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమించడంతో కష్టంగా ఉందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్, రవీందర్, మణిప్రకాశ్, జన్నీఫర్, శిల్ప, హసీనా, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఎగువ, దిగువ జూరాల విద్యుదుత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి కొనసాగుతోంది. జలాశయానికి 1,33,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్న క్రమంలో పీజేపీ అధికారులు విద్యుదుత్పత్తికి 32,475 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.927, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 174.750 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం వరదనీటి లభ్యతకనుగుణంగా ఎగువన 201.187, దిగువన 174.750 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశామని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వస్తున్న వరద పెరుగుతోంది. జలాశయంలోకి 1.33 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 15 గేట్లు జలవిద్యుదుత్పత్తి ద్వారా 1.37లక్షల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. ఆలమట్టి జలాశయంలోకి 66వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 60వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 65వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 61వేల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు.

రాజోలి, న్యూస్‌టుడే : సుంకేసుల జలాశయానికి స్వల్ప వరద ప్రవాహం కొనసాగుతుంది. ఎగువ నుంచి 9,150 క్యూసెక్కుల నీరు వస్తుండగా రెండు గేట్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని దిగువకు, 2,400 క్యూసెక్కులు కేసీ కాలువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 291.50 మీటర్ల నీటి మట్టం ఉంది.

తుంగభద్ర నదిలో 6650 క్యూసెక్కులు..

శాంతినగర్, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో శుక్రవారం 6,650 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.8 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.7 అడుగులుగా నమోదవుతోంది.

నీటిపారుదల నిర్వహణ ఇక మెరుగు!

క్షేత్ర స్థాయి సిబ్బంది నియామకానికి పచ్చజెండా


రామన్‌పాడ్ జలాశయం కింద దేవర్‌పల్లి శివారులో అధ్వానంగా కుడి కాలువ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నీటిపారుదల నిర్వహణలో కీలకంగా ఉండే లస్కర్లు, సహాయకుల నియామకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన అన్నదాతల్లో ఆనందం నింపింది. వీరి నియామకంతో సాగునీటి జలాశయాలు, చెరువులు, కుంటల ఆయకట్టు కింద నీటి పారుదల నిర్వహణ మెరుగుపడనుంది. గురువారం రాష్ట్ర స్థాయిలో జరిగిన సాగునీటి సమీక్ష సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ప్రకటన వెలువడటంతో ఆయా జలాశయాల కింద పొలాలు, స్థిరాస్తి నష్టపోయిన బాధిత కుటుంబాలు, నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి సాగునీటి పథకాల కింద లస్కర్లు, సహాయకుల నియామకాలు ఏళ్ల తరబడిగా చేపట్టలేదు. జూరాల జలాశయం నిర్మాణ పనుల్లో పాల్గొన్న మ్యాన్ మజ్దూర్లలో చాలా మంది పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో జీవో నెం.45 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 3,293 మంది లస్కర్లకు కేవలం 419 మంది, 728 మంది సహాయకులకు 196 మంది ఉన్నారని జులై 2016లో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రభుతానికి నివేదించారు.
- కొత్తగా లస్కర్లు, సహాయకుల ఖాళీలను భర్తీ చేయాలని 10 జూన్ 2021న ప్రతిపాదనలు పంపారు. గత ఏడాది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులను ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆయా నీటిపారుదల శాఖ సీఈ కార్యాలయాల పరిధిలో లస్కర్లు, సహాయకులను నియమించారు.
- నారాయణపేట డివిజన్‌కు 23 మందిని, వనపర్తి డివిజన్‌కు 124 మంది నియమించారు. అయినప్పటికీ లస్కర్లు, సహాయకుల కొరత తప్పడం లేదు. యాసంగిలో సాగునీటి పారుదలను నియంత్రించే సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు సమస్య ఏర్పడుతోంది.

మార్గదర్శకాలు ఇవీ..

- ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ. ఒకరు, ఉప కాలువ కింద ప్రతి 112 కి.మీ. ఒకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు ఒకరు చొప్పున లస్కర్లు విధులు నిర్వర్తించాలి.
- ప్రధాన కాలువపై ప్రతి ఐదు మంది లస్కర్లను ఒకరు, ఉపకాలువల కింద ప్రతి ఆరు మంది లస్కర్లపై ఒకరు చొప్పున సహాయకులను నియమించాల్సి ఉంటుంది. వీరి కొరత వల్ల ఈ మార్గదర్శకాలు అమలు కావడం లేదు.
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన నేపథ్యంలో కొత్తగా 281 మంది సహాయకులు, 1,597 మంది లస్కర్లను నియమించేందుకు చర్యలు తీసుకోనున్నారని నీటిపారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

ఆదేశాలకనుగుణంగా చర్యలు : కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం. **- శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ, పెబ్బేర్ డివిజన్**

నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలి

మంత్రి జూపల్లి



అధిక సంఖ్యలో యువ క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయికి అవార్డు అందజేస్తున్న మంత్రి జూపల్లి, చిత్రంలో రమేష్‌రెడ్డి, వాణీ ప్రసాద్

మాదాపూర్, న్యూస్‌టుడే: జీవిత ముస్సుడి దాన్ని సొంతం చేసుకోవాలి. నిత్యం కుటుంబం, సంపాదనలో మునిగిపోకుండా కనీసం నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలను చూసి ప్రశాంతంగా గడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పర్యాటక ప్రదేశాల సందర్శనతో మనసుకు ఆనందం, ఆహ్లాదంతో పాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితమ్)లో ప్రపంచ పర్యాటక దినోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. పురాతన కట్టడాలు, కోటలు, దేవాలయాలు ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలున్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాలు పర్యాటకపరంగా ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చాలా మంది తమ నిత్యజీవిత పనుల్లో నిమగ్నమై ఏడాదికి ఒకసారి కూడా పర్యాటక ప్రదేశాలకు వెళ్లడం లేదన్నారు. నెలలో ఒక రోజు పర్యాటకానికి కేటాయించుకోవాలని చెప్పారు. తాను మంత్రి అయిన తర్వాతే గోల్కొండ కోటను చూశానన్నారు. యూనెస్కో గుర్తించిన రామప్ప లాంటి ఎన్నో కట్టడాలు, కళాఖండాలు, శిల్పసంపద తెలంగాణలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

వసతుల మెరుగుదలకు చర్యలు..

మూసీ రివర్ ఫ్రంట్‌ను అద్భుతంగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తుందని చెప్పారు. పర్యాటక ప్రదేశాల్లో వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ దర్శిని పేరిట విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలు వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సముద్రం, ఇసుక తప్ప ఏమీ లేని దేశాలకు వెళ్లి రూ.లక్షలు ఖర్చుచేయడం కాదు అద్భుతమైన కళాఖండాలు, చారిత్రక కట్టడాలు, కళల సంపద ఉన్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్‌లు తెలంగాణ పర్యాటకరంగానికి రాయబారులుగా వ్యవహరించాలన్నారు.

● అనంతరం రాష్ట్రంలో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకుగాను వరంగల్ కలెక్టర్ సత్య శారదా, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్‌లకు పర్యాటక శాఖ తరపున మంత్రి జూపల్లి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు చూడముచ్చటైన కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఇక్కడి పర్యాటక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను చాటుతూ అద్భుతమైన నృత్యప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఉర్రూతలూగించే జానపద కళలతో చూపరులను కట్టిపడేశారు.

ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ క్రీడాకారులకు మంచి వేదిక అని దీనిని సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయికి ఎదగాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్ర స్థాయి టోర్నీకి బయలుదేరిన ఉమ్మడి జిల్లా అండర్-19 జట్టును అభినందించారు. టోర్నీలో ప్రతిభ కనబరిస్తే కంబైన్డ్ జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం దక్కనుందన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, సంఘం సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-19 టోర్నీ..: హన్మకొండలో శనివారం నుంచి అండర్-19 అంతర్ జిల్లాల టోర్నీ ప్రారంభం కానుంది. పూల్ 'ఎ'లో మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, నల్గొండ జట్లు.. పూల్ 'బి'లో నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జట్లున్నాయి. ఉమ్మడి జిల్లా జట్టులో.. అబ్దుల్ రాఫె, ఇ.అభిలాశ్ గౌడ్, జి.శశాంక్, ఎం.సాత్విక్ రెడ్డి, ఎండీ ముఖీత్, డి.అభినవ్, జి.చరణ్ తేజ్, ఎస్.అభినయ్ తేజ, షాదాబ్ అహ్మద్, డి.రాజు, కె.మనోజ్, బి.కనిష్క్, రాంచరణ్, ఎం.అర్జున్ రెడ్డి, అంకిత్ రెడ్డి, జి.వివేక్, వి.నగేశ్, కె.హరినాథ్ ఎంపికయ్యారు. శనివారం తొలి మ్యాచ్‌లో జిల్లా జట్టు ఆతిథ్య వరంగల్ జట్టుతో తలపడనుంది.

చేతిలో శత్రువు





● ఎలాంటి చెడు అలవాట్లు లేని 36 ఏళ్ల వ్యక్తి క్యాన్సర్ బారిన పడి చనిపోయాడు. మద్యం, గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్ వంటివి ఏనాడూ తీసుకోకున్నా క్యాన్సర్ మహమ్మారి అతని ప్రాణాలను తీసింది. వైద్యులు ఆయన శరీరాన్ని పరిశోధించగా ప్లాస్టిక్ కవర్లలో తెచ్చిన వేడి ఆహారాన్ని తినడం, ప్లాస్టిక్ సీసాలో నీటిని తాగడం వల్ల అందులోని రసాయనాలతో క్యాన్సర్ బారిన పడినట్లు తేల్చారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో తెచ్చిన వేడివేడి టీ ఆరుసార్లు తాగేవాడు. ప్లాస్టిక్ సీసాలు, బాక్స్‌ల్లో వేడి ఆహారాన్ని, నీటిని ఉంచి తాగొద్దని హైదరాబాద్‌కు ప్రముఖ వైద్యుడు డా.నాగేశ్వర్‌రెడ్డి ఈ విషయాన్ని తెలియజేశారు.

● పంజాబ్‌లో మరణించిన ఆవుకు శవపరీక్ష చేయగా కడుపులోంచి 26 కిలోల ప్లాస్టిక్ సంచులు బయటపడ్డాయి. మనుషులు ప్లాస్టిక్ కవర్లలో ఆహారాన్ని పారవేయగా, ఆవు ఆ ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లతో సహా తినేసింది. ఆ ప్లాస్టిక్ కవర్లు జీర్ణం కాలేక కడుపులో అలాగే ఉండిపోయి చివరకు దాని ప్రాణం తీశాయి.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్లాస్టిక్‌ను నిషేధించామని అధికారులు చెబుతున్నా, అడపాదడపా దాడులు చేస్తున్నా ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం తగ్గడం లేదు.

న్యూస్‌టుడే, కోస్గి

ప్లాస్టిక్ లేకపోతే జీవితమే లేదు.. అన్నట్లుగా తయారయ్యింది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. చిన్న వస్తువు కొన్నా ప్లాస్టిక్ కవర్‌లో తీసుకువెళ్తున్నారు. బజారుకు వచ్చి పది వస్తువులు కొంటే వాటిని వేసుకునేందుకు నాలుగైదు కవర్లను ఆయా దుకాణదారుల నుంచి తీసుకుంటున్నారు. పిల్లలకు పాలు తాగించడానికి ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగిస్తున్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై, ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) బాటిళ్లపైన నిషేధం ఉంది. దుకాణాలపై దాడులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మన దగ్గర వ్యర్థాల పోగులు : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 19 పురపాలక సంఘాల్లో రోజూ 310 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పోగవుతుండగా, అందులో 108.9 మెట్రిక్ టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.. కలెక్టర్‌గా వెంకట్రావు ఉన్న సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తిలో శ్వేతా మహంతి కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రతి బుధవారం ప్లాస్టిక్ వినియోగం, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో మంచి ఫలితాలు రాగా ఆ తర్వాత అలాంటి కార్యక్రమాలు లేకుండా పోయాయి.



తిరుమల ఆదర్శం

కఠినంగా వ్యవహరించకుంటే విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం లక్షలాది భక్తులు తరలి వస్తారు. ఇక్కడ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించారు. కొండపైకి వెళ్లేటప్పుడు అలిపిరి వద్ద తనిఖీలు చేపడతారు. ప్లాస్టిక్ కవర్లు, తీసుకెళ్లనీయరు. మన పురపాలికలు ఇలా చేస్తే మేలు.

నిషేధ వస్తువులు ఇవే..

కేంద్ర ప్రభుత్వం 16 రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. ఇందులో ఇయర్ బడ్స్, బెలూన్లు, క్యాండి, ఇస్క్రీం కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్లలోపు ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్.

మార్పు మన నుంచే..

● మార్పు మన నుంచే మొదలవ్వాలి. నారాయణపేట జిల్లా ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా గుడ్డ సంచీలు తయారు చేసి తమతోపాటు తమ ఇళ్లల్లో వినియోగించేలా చూస్తున్నారు.

● నెలల తరబడి ఒకే టూత్ బ్రష్ వాడటం వల్ల ప్లాస్టిక్ రేణువులు శరీరంలోకి వెళతాయి. బ్రష్‌లు మార్చుకోవాలి. వీలైన వాళ్లు వేప, కాగు పుల్లలతో పళ్లు తోమడం అన్ని విధాలా మంచిది.

● పాఠ్యపుస్తకాల అట్టలకు ప్లాస్టిక్ పేపర్లు వాడే బదులు దినపత్రికలను, కాగితం కవర్లుగా వేయడం మంచిది. చిన్నారులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించవచ్చు. బ్యానర్లు, ఫ్లెక్సీలకు బదులుగా వస్త్రాల బ్యానర్లు వాడటం మంచిది.



ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా వస్త్రంతో తయారు చేసిన సంచులు

బాధ్యత మనదే..



● నిత్యావసర సరకులు, కూరగాయలు తెచ్చేందుకు విధిగా గుడ్డ సంచులు తీసుకువెళ్లాలి. ● మాంసం తెచ్చుకోడానికి స్టీల్ డబ్బాలను పట్టుకెళ్లడం మంచిది. బయట ప్రయాణించేటప్పుడు స్టీల్, రాగి సీసాలు ఉపయోగించాలి. ● టీ, పండ్ల రసాలు, పానీయాలు తాగేటప్పుడు గాజు, కాగితపు గ్లాసులను వినియోగించాలి. ● శుద్ధి చేసిన నీటిని డబ్బాలలో తీసుకోవడంకన్నా ఇంట్లోనే నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం. ● పాత జీన్ ప్యాంట్లను బస్తాలుగా కుట్టుకుంటే చాన్నాళ్లు మన్నికగా ఉంటాయి. వాటిపై అందమైన అల్లికలు చేయవచ్చు. ● ఏవైనా కార్యక్రమాలు జరిగేటప్పుడు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలి. కాగితంతో చేసినవైనా మేలే. ● అరటి, మోదుగ వంటి ఆకులతో చేసిన విస్తర్లలో భోజనం చేయడం అత్యుత్తమం. ● హోటల్ నుంచి పార్శిల్ తెచ్చుకునేటప్పుడు మనమే డబ్బాలను పట్టుకెళ్తే మంచిది. ● ఇప్పుడిప్పుడే మట్టిపాత్రలు, వస్తువుల ఉపయోగం పెరగడం ఆదర్శనీయం. ఇది మరింత విస్తరించాలి.

మీకు తెలుసా?

● ప్రతి మనిషి నిత్యం సగటున 25 నుంచి 50 గ్రాముల ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

● ప్లాస్టిక్ రేణువులు శరీరంలో చేరి పేగుల్లో క్యాన్సర్‌కు కారణమవుతుంది. మెదడులో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి.

రేణువులు అవయవాలలో చేరుతున్నాయి



ప్లాస్టిక్ నానో రేణువులు తెలియకుండానే శరీరంలోని అన్ని అవయవాల్లోకి చేరుతున్నాయి. ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే బయటకు రావు. కణ వ్యవస్థను దెబ్బతీస్తాయి. మనం తాగే శుద్ధ జలంలోనూ నానో ప్లాస్టిక్ రేణువులు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. చిన్నపిల్లలు ఐస్‌క్రీంలు, బేకరీ ఉత్పత్తులు తినేటప్పుడు నానో రేణువులు వెళ్లే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వస్తువుల్లో తినడం, తాగడానికి దూరంగా ఉండాలి.

- డా. శివకుమార్ సింగ్, సహాయ ఆచార్యులు, పాలమూరు విశ్వవిద్యాలయం

భూమాతకు ఎంత కష్టం



వస్తువు మట్టిలో కలిసేందుకు పట్టే సమయం

కూరగాయలు : 5 రోజుల నుంచి నెల **అరటి తొక్క :** 24 రోజులు **చెరకు పిప్పి :** 30- 60 రోజులు **కాగితం :** 20 రోజుల నుంచి అయిదు నెలలు **ఆకులు :** సంవత్సరం **సిగరెట్ పీక :** ఏడాది నుంచి పన్నెండేళ్లు **తోలు వస్తువులు :** 25 నుంచి 45 ఏళ్లు **నైలాన్ :** 30 - 40 సంవత్సరాలు **అల్యూమినియం వస్తువులు :** 80 ఏళ్లు **పాలిథిన్ కవర్లు :** 400 - వెయ్యి సంవత్సరాలు

రంగులతో ప్రమాదం



కవర్లకు కలిపే రసాయన రంగుల్లో ఆరోగ్యానికి హాని చేసే కాడ్మియం, సీసం వంటివి ఉన్నాయి. ఇవి నేలలో కరిగిపోవు. భూసారాన్ని కూడా నాశనం చేస్తాయి. ప్రతి ఏటా రెండు మిలియన్ల పక్షులు, సముద్రజీవులు ప్లాస్టిక్ కారణంగా చనిపోతున్నాయి. ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలి.

- వార్ల మల్లేశం, జాతీయ హరిత దళ సమన్వయకర్త

కానిస్టేబుల్‌పై ఎస్సైకి ఫిర్యాదు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బాధితుడికి సహకారం అందిస్తానని కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ.2వేలు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం లిఖిత పూర్వకంగా ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఘటనపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కల్లు దుకాణాలపై నార్కోటిక్, పోలీసుల దాడులు


పలువురు నుంచి నమూనాల సేకరణ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారీ చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు రాష్ట్ర నార్కోటిక్ అధికార బృందం గద్వాల పోలీసుల ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలోని పలు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.... గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, పూడూరు, మేలచెర్వు, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, ధరూర్ మండలంలోని మరో రెండు గ్రామాల్లో కల్లు తాగుతున్న సుమారు 20 మందికి పైగా అదుపులోకి తీసుకుని వారి నుంచి నమూనాలు సేకరించారు. అధికారులు తమ వద్ద కొన్ని ఎక్విప్‌మెంట్ ద్వారా మూత్రం ద్వారా పరీక్షలు నిర్వహించగా కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించినట్లు పాజిటివ్ ఫలితాలు తేలినట్లు సమాచారం. ఇంకా పూర్తి స్థాయి నిర్ధారణకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి గద్వాల గ్రామీణ పోలీసులు కల్లు తాగిన వారిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. గద్వాల నియోజకవర్గంలో కొందరు కల్లు నిర్వాహకులు మత్తుపదార్థాలను వినియోగించి కల్లును విక్రయిస్తున్నారని కొందరు రాష్ట్ర ఆబ్కారీ, నార్కోటిక్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, మరి కొందరు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు కల్తీ కల్లును అరికట్టేందుకు నార్కోటిక్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి దాడులు చేసినట్టు సమాచారం. కల్లులో మత్తు పదార్థాలు కలిపి తయారు చేసి విక్రయిస్తున్న కొందరి నిర్వాహకులపై సంబంధిత ఠాణాల్లో కేసు నమోదైనట్లు సమాచారం. దాడుల వివరాలు చెప్పేందుకు నార్కోటిక్ అధికారులు, గద్వాల పోలీసులు నిరాకరించారు. తాము సేకరించిన నమూనాల ఫలితాలను ప్రధాన కార్యాలయానికి నివేదిస్తామని నార్కోటిక్ అధికారులు చెప్పారు. అయితే ఇటీవల కల్లు దుకాణాలపై నార్కోటిక్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి పలువురి నిర్వాహకులపై కేసులు నమోదు చేయగా, శుక్రవారం మరోసారి దాడులు నిర్వహించడంతో నిర్వాహకులు కొందరు షాక్‌లో పడ్డారు.

ప్రజారోగ్యంతో ఆటలు



పేటలో స్టాంపింగ్ లేకుండానే విక్రయిస్తున్న మాంసం



చనిపోయిన గొర్రెల మాంసాన్ని అంటగట్టారంటూ కొందరు వినియోగదారులు నారాయణపేట మార్కెట్‌లో అమ్మకందారులతో ఇటీవల వాగ్వివాదానికి దిగారు. మాంసం విక్రయాల్లో నాణ్యత ఎంత ఘోరంగా ఉందో ఈ ఘటన అద్దం పడుతుంది. ఉమ్మడి జిల్లాలో మాంసం విక్రయాలను పరిశీలిస్తే అధికారులు దృష్టి సారించాల్సిన అంశాలెన్నో వెలుగు చూస్తున్నాయి.

న్యూస్‌టుడే- నారాయణపేట (పాతబస్టాండ్), మక్తల్ పట్టణం

ఉమ్మడి జిల్లాలో గొర్రె మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆదివారం వస్తే మటన్ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుంటాయి. మాంసాన్ని వండుకోడానికి వీలుగా సిద్ధం చేసే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా అనారోగ్యానికి కారణం అవుతుంది. చాలావరకు విక్రయాల్లో నిబంధనలు పాటించడంలేదు. కొద్దిమంది మాత్రం పరిశుభ్రమైన మాసం అమ్ముతున్నారు. వధించే జీవాల ఆరోగ్యాన్ని ధ్రువీకరించాల్సిన పశువైద్యాధికారులు ఉమ్మడి జిల్లాలో దాదాపు లేరనే చెప్పాలి. జీవాలకు ట్యాగ్ వేసిన తరువాత కోయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు జంతువులు రోగాలబారిన పడ్డాయి. మరికొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాల్లో మేకలు, గొర్రెలు మృతిచెందాయి. అవి మాంసంగా మారి వస్తున్నా పట్టించుకునే నాథుడు లేరు. నగర, పురపాలికల్లోని ప్రజారోగ్య శాఖ అధికారులు కూడా తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పెద్ద మొత్తంలో అమ్మకాలు

ఒక్కొక్క జిల్లాలో క్వింటాళ్ల కొద్దీ రోజూ మాంసం విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దాదాపు 7 నుంచి 8 వందల జీవాలు వధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం, పండగ వాటిసంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుంది. శాఖాపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లోనూ అవగాహన ఉండాలని పశువైద్యాధికారి అనిరుధ్ అన్నారు. మాంసంలో ఏదైనా తేడా ఉంటే జీవాల చిన్నప్రేగుల్లో ఉండే సుమారు 3వేల రకాల సూక్ష్మజీవుల లార్వాలు అనేక రకాల వ్యాధులను కలిగించే అవకాశం ఉందని వనపర్తి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ మిరాజ్ అహ్మద్ అన్నారు.

నోటీసులు అందజేస్తాం..



రహదారులపైనా, ఆవాసాల మధ్యలో జంతువులను వధిస్తే కఠిన చర్యలు తప్పవు. అపరిశుభ్ర వాతావరణంలో ఇష్టానుసారంగా వ్యవహరించే వ్యాపారస్తులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఇప్పటికే మాంస విక్రయాలకు పరిశుభ్రత పాటించాలని సూచించాం. ఓసారి పరిశీలించి నోటీసులు ఇస్తాం. పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవు.

-సునీత, పుర కమిషనర్, నారాయణపేట.

వధశాలలు ఏవీ?

కబేళాల్లోనే జీవాలు వధించాల్సి ఉన్నా పట్టించుకునేవారు కరవయ్యారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట, వనపర్తి, గద్వాలలో మాత్రమే వధశాలలు ఉన్నాయి. 14 మున్సిపాలిటీల్లో లేవు. అక్కడ ఇష్టారాజ్యంగా కోసి అమ్ముతున్నారు. మురుగుకాల్వల పక్కన, అపరిశుభ్ర వాతావరణంలో రోడ్డు పక్కన విక్రయాలు జరుగుతున్నాయి. జీవం కోసేటప్పుడు అది ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణపత్రం మంజూరు చేయాలి. మాంసాన్ని శుభ్రపరిచాక ఇవ్వాలి. ఇవేవీ అమలు కావడం లేదు. కొన్ని చోట్ల వయసు పైబడిన, మరికొన్ని చోట్ల గొర్రె పిల్లలను నరికి విక్రయిస్తున్నారు.

వ్యర్థాలతో అనర్థం

జీవాలను కోసిన తరువాత వ్యర్థాలను రోడ్లపైకి, నదుల్లోకి, కాలనీల మధ్య పడేస్తున్నారు. దుర్వాసనకు దోమలు, పందులు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నారాయణపేట, కోస్గి, జడ్చర్ల వంటి ప్రాంతాల్లో ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. రహదారులపై దుమ్ము, ధూళి మాంసంపై పడుతోంది. జిల్లాలోని దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో మాంసం వ్యర్థాల కోసం వీధికుక్కలు ఎగబడుతున్నాయి. కాలనీల మధ్యలో వాటి సంచారం మూలంగా పలువురు కాట్లకు గురవుతున్నారు.

నల్లమలలో గుప్త నిధుల తవ్వకాలు!



లక్ష్మాపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

అమ్రాబాద్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం లక్ష్మాపురం పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాల కోసం వచ్చిన కొందరిని గ్రామస్థులు పోలీసులకు అప్పగించిన సంఘటన కలకలం రేపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం కొందరు కారులో వచ్చి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వాహనాన్ని నిలిపారు. అందులో కొందరు గ్రామ సమీప అడవిలోని నర్సింహస్వామి ఆలయం వైపు వెళ్లగా మరికొందరు గ్రామంలోనే తచ్చాడారు. గ్రామస్థులు అనుమానంతో ప్రశ్నించగా అటవీ అధికారులమని అడవిలో విద్యుత్తు కంచె వేస్తున్నట్లు సమాచారం రావటంతో పరిశీలించేందుకు వచ్చామని బుకాయించారు. రాత్రి 12 గంటలైనా కారు అక్కడే ఉండటంతో గ్రామస్థులు అనుమానంతో రాత్రి 1.30 గంటల సమయంలో అడవిలోకి వెళ్లి పరిశీలించారు. ఎదురు పడిన వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పారు. కొందరు పారిపోగా ఇద్దరిని పట్టుకొని ప్రశ్నిస్తుండగా పోలీసులు వచ్చి గ్రామస్థుల అధీనంలో ఉన్న వారిని, కారును, ద్విచక్రవాహనాన్ని ఠాణాకు తీసుకెళ్లారు. గ్రామస్థులు శుక్రవారం ఉదయం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇదే బృందంలోని కొందరు ఇటీవల కొన్ని ప్రధాన ఆలయాలను పరిశీలించినట్లు సమాచారం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి, మరో వ్యక్తి హరిని విచారించామని కారులో గాని వారి వద్ద గాని ఎలాంటి పరికరాలు లభించలేదన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
గద్వాల గ్రామీణం : 9052211532 | అలంపూర్ : 8008573916
అయిజ : 8008573922 | అలంపూర్ పట్టణం : 8008573930


నాగర్‌దొడ్డి బీసీ కాలనీలో రోడ్డు పైనే పారుతున్న మురుగునీరు

సమస్య: నాగర్‌దొడ్డి బీసీ కాలనీలో మురుగుకాల్వలు నిర్మాణం చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో విష పురుగులు సంచరిస్తున్నాయి. కాల్వలు నిర్మించాలి. **-ప్రభాకర్ రైతు, నాగర్‌దొడ్డి గ్రామం.**

సమస్య: మురుగు కాల్వల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు రాగానే నిర్మాణం చేపడుతాం. **-ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో మల్దకల్.**

-న్యూస్‌టుడే, మల్దకల్

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... దేవర (మూడు స్క్రీన్లు)
అయిజ: శివసాయి **: దేవర,** భువనేశ్వర్ **: 100 కరోడ్స్**
మాధవ్ **: మత్తు వదలరా - 2**
-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

ఆరోగ్య యోగం సిద్ధించేనా.?

శిక్షకుల నియామకం చేపట్టిన ఆయూష్ మంత్రిత్వ శాఖ


రాజోలిలో పీహెచ్‌సీ ఆవరణంలో నిరుపయోగంగా యోగా కేంద్రం

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం. అందుకు రోజూ యోగా అవసరమని గుర్తించిన ఆయూష్ మంత్రిత్వ శాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఆరోగ్య యోగా స్వస్థత మందిర్(యోగా షెడ్లు) నిర్మాణాలను చేపట్టింది. కానీ శిక్షకులు లేకపోవడంతో అవి రెండేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయి. తాజాగా ప్రారంభించిన శిక్షకుల నియామకాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయనుంది.

జిల్లాలో ఇలా.. : జోగులాంబ గద్వాల జిల్లాలో 12 మండలాల్లో ఆయుష్ విభాగానికి సంబంధించి 9 కేంద్రాలున్నాయి. అందులో గద్వాల నియోజకవర్గంలో నాలుగు, అలంపూర్ డివిజన్‌లో 5 ఉన్నాయి. ప్రస్తుతం వీటిని వెల్‌నెస్ కేంద్రాలుగా మార్చారు. ఒక్కోదానికి రూ.6 లక్షల చొప్పున ఖర్చు చేసి నిర్మించారు. వీటిని ప్రారంభించకపోవడంతో యోగా దినోత్సవం రోజు మాత్రమే వినియోగిస్తూ వస్తున్నారు. వీటితో పాటు నేషనల్ రూరల్ హెల్త్ మిషన్(ఎన్‌ఆర్‌హెచ్ఎమ్) పరిధిలో మరో 7 యోగా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు.

రోజూ గంట...: ఒక్కో కేంద్రానికి ఇద్దరు శిక్షకుల(పురుషుడు, మహిళ) ను నియమించనున్నారు. వీరు పురుషులకు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, మహిళలకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణలో ఉచితంగా యోగాసనాలు నేర్పిస్తారు. ఆయూష్ వైద్యులు ఉంటే ఆ వైద్యంపై అవగాహన కల్పిస్తారు. వీటితో పాటు తులసి, వేప, జిల్లేడు, కలబంద, మెంతులు, అశ్వగంధ, ఉసిరి తదితర ఔషధ మొక్కల ఉపయోగాలను వివరిస్తారు. అయితే జిల్లా జనాభా 6.50 లక్షలు ఉండగా ఇందులో మాలామంది శారీరక శ్రమకు దూరమై రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులతో సతమతవుతున్నారు. వీరు యోగా కేంద్రాలను వినియోగించుకుంటే పలు రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి...: ఆయుష్ వైద్య సేవలను విస్తృతం చేయడమే లక్ష్యంగా యోగా కేంద్రాలు నిర్మించారు. శిక్షకుల ఎంపికలు జరుగుతున్నాయి. ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూస్తాం.
- డా.మఫాజ్, ఆయుష్ విభాగం జిల్లా ఇంఛార్జి, రాజోలి

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

అయిజ, న్యూస్‌టుడే : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం అయిజ పట్టణంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల్‌రెడ్డి, ఆంజనేయులు, కిష్టన్న, ఎస్వీ హనుమంతు, భీమన్న, మహేశ్, ప్రదీప్ కుమార్, భగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ కేజీబీవీ తనిఖీ

ఇటిక్యాల, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు సమర్థవంతమైన విద్యా పద్ధతులను పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగారావు సూచించారు. శుక్రవారం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోగులాంబ సన్నిధిలో రథోత్సవం

అలంపూర్, న్యూస్‌టుడే : అలంపూర్ జోగులాంబ సన్నిధిలో శుక్రవారం రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకి సేవలో తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అర్చకులు ప్రత్యేక హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల ఆవరణలు శుభ్రం

అలంపూర్, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా పుర సిబ్బంది స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా అలంపూర్ పాపానాశి ఆలయాల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో నితీష్, ఆంజనేయులు, మద్దిలేటి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న పుర అధ్యక్షురాలు మనోరమ

అలంపూర్, న్యూస్‌టుడే : పురపాలిక పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసుకుందామని అలంపూర్ పుర అధ్యక్షురాలు మనోరమ అన్నారు. శుక్రవారం పుర కార్యాలయంలో ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కమిషనర్ సరస్వతి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు, మురుగు కాల్వలు, వీధిదీపాల సమస్యలు లేకుండా చూడాలని తీర్మానించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అవసరం



అమరవాయి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు, న్యూస్‌టుడే : 'డ్రై డే-ఫ్రై డే'ను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది శుక్రవారం ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యానికి సంబంధించిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమైఖ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు


గద్వాల : పోటీలకు హాజరైన క్రీడాకారులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని చింతలపేట ఇండోర్ స్టేడియంలో శుక్రవారం అండర్-14 విభాగంలో బాలుర జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు అంకితభావంతో ఆడి క్రీడా ప్రతిభను చాటాలని సూచించారు. పోటీలకు నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల నుంచి క్రికెట్ జట్లు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం ఆయా జిల్లాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు వచ్చే నెల 3, 4 తేదీల్లో క్యాంపు నిర్వహించడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు.

దోపిడీ లేని సమాజం కోసం నడుం బిగించాలి: పీడీఎస్‌యూ



మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

మల్దకల్, న్యూస్‌టుడే: అసమానతలు దోపిడి లేని సమాజం కోసం యువత నడుం బిగించి లక్ష్యం సాధించాలని పీడీఎస్‌యూ నడిగడ్డ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా అన్నారు. మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యారంగ సమస్యలపై సెమినార్‌ను పీడీఎస్‌యూ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆకె పోగురాజు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి విద్యార్థులు, యువత సమరశీల పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. మల్దకల్ కళాశాల పీడీఎస్‌యూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా తిరుమల్, శివ. ప్రధాన కార్యదర్శిగా శ్వేత, శివకృష్ణ, కస్తూరి, సహాయ కార్యదర్శిగా శంకర్, కోశాధికారి వెంకటేశ్ మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తిరుమల్, సురేందర్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


గట్టు: తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సరితారాణి


అయిజ: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

గట్టు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని అధికారులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితారాణి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధరూరు: తెలంగాణ కోసం పాటుపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ అని తహసీల్దార్ వెంకట్రావు అన్నారు. ధరూరు, కేటిదొడ్డి మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేటిదొడ్డి ఉప తహసీల్దార్ శివశంకర్ పాల్గొన్నారు.

అలంపూర్, న్యూస్‌టుడే : పురపాలిక కార్యాలయ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుర కమిషనర్ సరస్వతి, అధ్యక్షురాలు మనోరమ, ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ, న్యూస్‌టుడే : తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శనీయుడని భారాస జిల్లా సమన్వయకర్త పల్లయ్య అన్నారు. కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా శుక్రవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. అనంతరం చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి శాంతినగర్, కొంకల, జూలేకల్‌లో నివాళి అర్పించారు. ఆయన సేవలను తహసీల్దార్ ప్రభాకర్ కొనియాడారు.

రాజోలి, న్యూస్‌టుడే : రాజోలిలో కొండా లక్ష్మణ్ జయంతిని వివిధ పార్టీల నాయకులు, చేనేత కార్మికులు కలిసి నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దస్తగిరి, సూర్యోదయ చేనేత సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల, న్యూస్‌టుడే : తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ భీమ్‌షేన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


వడ్డేపల్లి: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్


రాజోలి: నాయకులు, చేనేత కార్మికులు

కంపచెట్లతో ఇబ్బందులు



మల్దకల్ నుంచి ఎద్దులగూడెం వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపుల కంపచెట్లు రోడ్డును ఆక్రమించుకొని పెరగడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కంపచెట్లతో కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి అడ్డంగా పెరిగిన కంపచెట్లను తొలగించి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ సమస్యపై పీఆర్ ఏఈ బషీర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కంపచెట్లు తొలగించడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. **-న్యూస్‌టుడే, మల్దకల్**

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు


పొక్లెయిన్‌ను వెనక్కి పంపుతున్న గ్రామస్థులు

అయిజ, న్యూస్‌టుడే : మండలంలోని పులికల్ గ్రామ సమీపంలో గట్టు వద్ద కొనసాగుతున్న మొరం అక్రమ తరలింపును గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. పొక్లెయిన్‌ను వెనక్కి పంపారు. మట్టి తరలిస్తే గ్రామ అవసరాలకు లేకుండా పోతుందన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని ధర్నా


పాఠశాల ఎదుట బైఠాయించిన విద్యార్థులు

అయిజ, న్యూస్‌టుడే : టీటీదొడ్డి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలంటూ పాఠశాల ఎదుట శుక్రవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సుమారు 230 మందికిపైగా ఉన్న విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నియామకాలను చేపట్టాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం ప్రారంభం

రాజోలి: భవనం నిర్మించి ఐదేళ్ల తర్వాత రాజోలిలో ఎమ్మార్సీ కార్యాలయాన్ని శుక్రవారం విద్యాధికారి భగీరథరెడ్డి ప్రారంభించారు. ఇప్పటి వరకు ఉమ్మడి వడ్డేపల్లి మండలంలో కార్యాలయం ఉండేది. ఇటీవల కొత్త ఎంఈవోల నియామకం చేపట్టడంతో కార్యాలయాన్ని ప్రారంభించినట్లు భగీరథరెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రం కొత్త బస్టాండ్ సమీపంలోని ద్వారకామాయి సాయి మందిరంలో ఈనెల 28 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు కె.ప్రసాద్ వెల్లడించారు.

కేంద్ర పథకాలతోనే అభ్యున్నతి

అయిజ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి చెందుతున్నాయని భాజపా మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. వివిధ కేంద్ర పథకాలను వివరించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో నరేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

రాజోలి, న్యూస్‌టుడే : మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో షేక్ అస్లాం షరీఫ్ ఆయన తండ్రి షేక్‌ఖాదర్ షరీఫ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాల సంచులతో పాటు అభ్యసన సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులకు వివిధ రకాల వస్తువులు అందించారు. జీహెచ్‌ఎం హరుణ్ రషీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి



ఉండవల్లి: సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మానవపాడు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రైవేటు ఉపాధ్యాయులు, సిబ్బందికి రక్షణ కల్పించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ (టీపీటీఎఫ్) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మానవపాడు ఠాణాలో హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్నకు వినతి పత్రం సమర్పించారు. మల్లికార్జున్, శేఖర్, రఫీ, ఈరన్న పాల్గొన్నారు.

ఉండవల్లి: ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్, టీచర్లపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉండవల్లి మండలంలోని ప్రైవేటు పాఠశాలల డ్రైవర్లు, టీచర్లు తహసీల్దార్ హరికృష్ణకు, స్థానిక ఠాణాలో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు.


రాజోలి: నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

రాజోలి: ప్రైవేట్ పాఠశాలల సిబ్బందిపై దాడులను నిరసిస్తూ రాజోలిలో ప్రైవేట్ పాఠశాలల బోధకులు, సిబ్బంది నిరసన చేపట్టారు. బడులు బంద్ చేసి నినాదాలు చేశారు. అనంతరం రాజోలి తహసీల్దార్ రాంమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులపై, బస్ డ్రైవర్లపై దాడులను నిరసిస్తూ శుక్రవారం ప్రైవేటు టీచర్స్ ఫోరం, బస్ డ్రైవర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పాఠశాలలు బంద్ చేసి ర్యాలీ తీశారు. గద్వాలలోని భీంనగర్ నుంచి కృష్ణవేణి చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, ఆస్పత్రి రోడ్, ఆర్వోబీ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం

ముగిసిన శిక్షణ తరగతులు


మంచినీటి సహాయకులతో జడ్పీ ఉప సీఈవో భాగ్యలక్ష్మి, చిత్రంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం గద్వాలలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో చేతి పంపుల మరమ్మతులు, ఎలక్ట్రికల్ బోర్లు - పంపుసెట్ల నిర్వహణ, ప్లంబింగ్, మంచినీటి నాణ్యత - సంరక్షణ వంటి అంశాలపై నాలుగు రోజులుగా గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవిలు హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఆయా గ్రామాల వాటర్‌మెన్‌లకు వారు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



వడ్డేపల్లిలో పుర సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శాంతినగర్, న్యూస్‌టుడే : వడ్డేపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పుర అధ్యక్షురాలు కరుణ, కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పుర సిబ్బందికి డా.మానస పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం సిబ్బందికి పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షురాలు సుజాత, కౌన్సిలర్ లలితమ్మ, ఈదన్న, నర్సింహులు పాల్గొన్నారు.

మానవపాడు, న్యూస్‌టుడే : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి డా.సింధూ, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇటిక్యాల, న్యూస్‌టుడే : మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పది పంచాయతీలకు చెందిన 45 మందికి పరీక్షలు చేశారు. ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్, వైద్యాధికారి రాజశేఖర్‌గౌడ్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో శేఖర్ పాల్గొన్నారు.

రాజోలి, న్యూస్‌టుడే : మండలంలోని మాన్‌దొడ్డి, రాజోలి పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో ఖాజామొయినుద్దీన్, వైద్యాధికారి మధుబాబు, కార్యదర్శులు కృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

అలంపూర్, న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు, జోగులాంబ గద్వాల జిల్లా ఫోర్టుఫోలియో న్యాయమూర్తి పుల్ల కార్తిక్‌ను అలంపూర్ న్యాయవాదులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. అలంపూర్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు న్యాయవాదులు చెప్పారు. వందల సంఖ్యలో కేసులు పెండింగులో ఉన్నాయని, కోర్టు ఏర్పాటుతో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని న్యాయమూర్తి కార్తిక్ చెప్పినట్లు వివరించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి జోగులాంబ అమ్మవారి ప్రసాదం అందజేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి, అలంపూర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోండి


గట్టులో పోషకాహార శాలను పరిశీలిస్తున్న సీడీపీవో నాగరాణి

గట్టు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగరాణి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం మండల స్థాయి' పోషణాభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార శాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి ప్రియాంక, ఎంపీడీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పుష్ప అన్నారు. శుక్రవారం రామాపురం, పైపాడు, బుడమర్సు కొంకల, జూలేకల్, తుమ్మాజీపల్లె, జక్కిరెడ్డిపల్లెలో పోషణ మాసం నిర్వహించారు. టీచర్లు సలోమి, ఫరిదాబేగం, రాజేశ్వరి, రమాదేవి, రేణుక, శ్రీదేవి పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి


బాలల హక్కుల గోడపత్రికలను విడుదల చేస్తున్న మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, తదితరులు

గట్టు, న్యూస్‌టుడే: బాలల హక్కులను అందరూ పరిరక్షించాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల, బాలికల పరిరక్షణకు ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందని, వాటిపై అవగాహన పెంచుకుని తమకు కలిగే ఇబ్బందులు దూరం చేసుకోవాలన్నారు. చట్టాలపై పోలీసు, ఇతర శాఖల అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు న్యూస్‌టుడే: బాలబాలికలకు సమానంగా విద్యావికాసం పొందాల్సిన అవసరం ఉందని మార్కెట్ ఛైర్మన్ హనుమంతు అన్నారు. శుక్రవారం కేటిదొడ్డి పాఠశాలలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాలల వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరావు, సీఆర్పీ యుగంధర్ పాల్గొన్నారు.

వడ్డేపల్లి: రామాపురం జడ్పీ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, లింగ సమానత్వం, బాలికల ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. ఎంఈవో నర్సింహులు, సంస్థల సభ్యులు హనిమిరెడ్డి, లత, సీఆర్‌పీఎఫ్ సభ్యుడు సుధాకర్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల కలెక్టరేట్ ఆవరణలో ద్విచక్రవాహనం, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. గద్వాలకు చెందిన కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా కలెక్టరేట్ ఆవరణలోనే ఎదురుగా వాహనం రావడంతో రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గద్వాల పట్టణ పోలీసులు తెలిపారు.